ప్రజాశక్తి

బుధవారం 12 జూన్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



బాబు నోట.. విశాఖ మాట

- రాష్ట్ర ఆర్థిక, ఆధునిక రాజధానిగా ఎన్‌డిఎ శాసనసభా పక్ష సమావేశంలో వ్యాఖ్య
- ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడితే అదే గొప్ప అభివృద్ధి అంటున్న మేధావులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ... ఈ పేరు చెప్పగానే పాలకులకు ఎక్కడ లేని హామీలు గుర్తుకొచ్చేస్తాయి. పూనకం వచ్చినట్టుగా భరోసా ఇచ్చేయడం పరిపాటి. గత జగన్ ప్రభుత్వం విశాఖను పరిపాలనా రాజధానిగా 2019లో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు, భవనాల నిర్మాణాలు చేపట్టిన దాఖలా లేదు. రుషికొండపై చేపట్టిన భవనాల నిర్మాణం అత్యంత రహస్యంగాను, వివాదాస్పదంగాను మారిన సంగతి విదితమే. రూ.వందల కోట్ల ప్రభుత్వ నిధులతో అవి కట్టినప్పటికీ 'జగన్ ప్యాలస్' అని వాటిపై ముద్ర పడింది. వైసిపి ప్రభుత్వ మూడు రాజధానుల భావనను రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ తప్పుబట్టాయి. కోర్టులూ మొట్టికాయలు పెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా 2024 ఎన్నికల్లో జగన్ ప్రభుత్వం పడిపోయింది. కూటమి పార్టీలు టిడిపి, జనసేన, బిజెపి రాష్ట్రంలో పగ్గాలు చేపట్టాయి. ఈ క్రమంలో మంగళవారం విజయవాడలో జరిగిన ఎన్‌డిఎ శాసనసభా పక్ష సమావేశంలో రాష్ట్రానికి ముఖ్యమంత్రి కానున్న చంద్రబాబు విశాఖను ఆర్థిక రాజధానిగానూ, ఆధునిక రాజధానిగానూ తీర్చిదిద్దుతామని అన్నారు.

ఆర్థిక రాజధానిగా ఇప్పటికే విశాఖకు ఆ గుర్తింపు ఉంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో గాజువాక పారిశ్రామిక ప్రాంతం గణనీయ వాటాను కలిగి ఉంది. స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డు, వైజాగ్ పోర్టు, రైల్వే, ఎల్‌ఐసి వంటి కీలక సంస్థలతో ఆర్థిక రాజధానిగా విశాఖ మిగతా 2లో..

వార్త 2లో..



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బన్న

దళితుల భూములకు నష్టం చేకూర్చే..

జిఓ 596ను రద్దు చేయాలి : కెవిపిఎస్

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి 50 బస్సులు

జిల్లా అధికారులకు అందని అద్దె చెల్లింపు సమాచారం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల నుంచి పార్టీ శ్రేణులను అక్కడకు తరలించడానికి 50 ఆర్‌టిసి బస్సులను కేటాయించారు. అవి కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లికి కూటమి శ్రేణులను తీసుకుని మంగళవారం బయలుదేరాయి. ఆర్‌టిసి ఉన్నతాధికారుల ఆదేశాలతో అసెంబ్లీ నియోజకవర్గానికి నాలుగు బస్సులకు తక్కువలేకుండా కేటాయించారు. మండలానికి మిగతా 2లో..

ఘనంగా గంగమ్మ తల్లి పండగ

వార్త 4లో..

ఖరీఫ్‌కు ముమ్మర ఏర్పాట్లు

వార్త 3లో..

ఎపిఇఎపి సెట్‌లో విశాఖకు ర్యాంకులు

వార్త 4లో..

మొదటి పేజీ తరువాయి..

బాబు నోట.. విశాఖ మాట

పేరు తెచ్చుకుంది.

ఉన్నది ఉన్నట్టుగా ఉంచితే అదే అభివృద్ధి

విశాఖను ఉన్నది ఉన్నట్టుగా అంటే ఇక్కడున్న పరిశ్రమలను ధ్వంసం చేసే విధానాలను తీసుకోకుండా పాలకులు శ్రద్ధ వహిస్తే చాలు... ఈ ప్రాంతానికి ఎంతో గొప్ప మేలు అని మేధావులు, ప్రజలు, సామాన్యులందరిలోనూ అభిప్రాయంగా ఉంది. వాస్తవానికి విశాఖ పారిశ్రామిక పట్టణంగా, ఆర్థిక రాజధానిగా రాష్ట్ర విభజన తర్వాత ఖ్యాతి సాధించిన సంగతి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. సహజ సిద్ధమైన తీరం, అందమైన ప్రదేశాలు, ఎత్తయిన పచ్చని కొండలతో విశాఖ పర్యావరణ పరంగానూ సౌందర్యవంతమైనదే. కేంద్రంలో 2014 నుంచి అధికారంలో కొనసాగుతున్న బిజెపి సర్కారు ప్రైవేటీకరణ విధానంతో విశాఖపట్నంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు చేస్తోంది. స్టీల్‌ప్లాంట్‌పై ఇప్పటికీ ప్రైవేటీకరణ కత్తి వేలాడుతూనే ఉంది. మూడున్నర సంవత్సరాలుగా కార్మికవర్గం ఈ ప్రైవేటీకరణపై ఉద్యమం కొనసాగిస్తోంది. స్టీల్‌ప్లాంట్‌ను రాష్ట్రంలోని కూటమి పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పరిరక్షిస్తే విశాఖకుగల ఆర్థిక రాజధాని ముద్ర పదిలంగా ఉంటున్నది పలువురి మాట.

ఐటి రంగంపై అడుగులేమిటి ?

ఇక్కడ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగం అభివృద్ధి కావాలన్న కాంక్ష ఈ ప్రాంత ప్రజల్లో ఏనాటి నుంచో ఉంది. 2014-19 మధ్యకాలంలో చంద్రబాబు అధికారంలో ఉండగా అలాంటి ప్రయత్నాలేమీ విశాఖపై ఫోకస్‌గా సాగలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 2022లో ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో ఐటి కంపెనీల విస్తరణ కోసం ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పారిశ్రామిక సదస్సులు జరపడం తప్ప సాధించిందేమీ లేదు. పైగా ఈ ప్రాంతంలో తరచూ తుపాన్లు వచ్చే అవకాశం ఉందని, రుషికొండ, మధురవాడ కొండలపై ఐటి కంపెనీలు కొత్తవి రాకపోవడానికి కారణం ఇదేనని అప్పట్లో ప్రధాన స్రవంతి మీడియాలో ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. పైగా ఇప్పటికే హైదరాబాద్, బెంగళూరు నగరాలు ఐటి పరంగా ఎంతో అభివృద్ధి చెందాయి. పైగా ప్రపంచంలో ఎఐ టెక్నాలజీ విసిరే సవాళ్లను తట్టుకోలేని స్థితిలో కూడా కొట్టుమిట్టాడుతున్నాయన్నది వాస్తవం. ఇలాంటి స్థితిలో విశాఖలో ఐటి కంపెనీలు తెచ్చేస్తామనే భరోసా ఎంతమేరకు వర్కవుట్ అవుతుందో చూడాల్సిందే.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి 50 బస్సులు

ఒక బస్సు చొప్పున పంపారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేటాయించే బస్సులకు చెల్లించే అద్దె విషయాన్ని ఉన్నతాధికారులు జిల్లా ఆర్‌టిసి అధికారులకు తెలియజేయలేదు. లక్షల రూపాయల ఆదాయం ఆర్‌టిసికి పోతుందని తెలిసినా మాట్లాడలేని పరిస్థితిలో స్థానిక అధికారులు బస్సులు పంపించారు. మంగళవారం సాయంత్రం నుంచి బస్సులను మండలాలకు పంపించడంతో సాధారణ ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఇబ్బందులు కేసరపల్లి నుంచి తిరిగి డిపోలకు బస్సులు చేరుకొనే వరకు ప్రజలకు తప్పవు. అనకాపల్లి జిల్లాలో ఆరు నియోజకవర్గాలకు 24, విశాఖపట్నం జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు 24 ఆర్‌టిసి బస్సులు కేటాయించారు. బస్సులు నియోజకవర్గాల వారీగా పంపడం తప్ప వాటిపై ఎటువంటి నియంత్రణా ఆర్‌టిసికి లేదు. ప్రమాణ స్వీకారానికి బయల్దేరిన పార్టీ శ్రేణులకు ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు పాస్‌లు ఇవ్వనున్నారు. ఎమ్మెల్యేలు జారీ చేసిన పాస్‌లతో ప్రమాణ స్వీకారానికి అనుమతించనున్నారు. బస్సులు మండలాలకు చేరే వరకు పర్యవేక్షణ బాధ్యత ప్రభుత్వ యంత్రాంగం దగ్గరుండి చూసింది. ఆ తరువాత తమ వారిని తరలించే పని కార్యకర్తలకు ఎమ్మెల్యేలు అప్పగించారు. ఆర్‌టిసి బస్సులను బహిరంగ సభలు, సమావేశాలకు వాడుకోవడం ప్రభుత్వాలకు ఒక ఆనవాయితీగా మారింది.

దళితుల భూములకు నష్టం చేకూర్చే..

జిఒ 596ను రద్దు చేయాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దళితుల భూములకు నష్టం చేకూర్చే జిఒ 596ను తక్షణం రద్దు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సంఘం జిల్లా కమిటీ సమావేశం మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో టి.చిరంజీవి అధ్యక్షతన జరిగింది. జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ జిల్లాలోని ఆనందపురం, భీమిలి, పద్మనాభం మండలాల్లోనూ, విజయనగరం జిల్లాలోని భోగాపురం చుట్టుపక్కల మండలాలైన పూస పాటిరేగ, డెంకాడల్లోనూ దళితుల భూములను జిఒ 596ను అడ్డం పెట్టుకొని భూబకాసురులు దౌర్జన్యంగా కాజేసారన్నారు. గత ప్రభుత్వం నిలిపివేసిన 27 దళితుల పథకాలను కొత్త ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు పరచాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలా సబ్‌ప్లాన్ నిధులను జనరల్ పథకాలకు మళ్లించకూడదన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌ను ప్రారంభించాలని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్లకు నిధులు కేటాయించి, దళిత, గిరిజన, బలహీనవర్గాల యువతకు స్వయం ఉపాధి పథకాలకు రుణాలను మంజూరు చేయాలని, దళిత గిరిజన పేటలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి, జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.ప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షులు వైటి.దాస్, వై.రాజు, నాయకులు పెంటారావు, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ డివిజన్‌లో రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌లో కాజీపేట-బల్లార్ష సెక్షన్‌లోని ఆసిఫాబాద్ రోడ్ - రెచ్ని రోడ్ స్టేషన్లలో మూడో లైన్ కమీషన్, ప్రీ/నాన్ ఇంటర్ లాకింగ్ పనులు, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను విశాఖపట్నం - దువ్వాడ - విజయవాడ -వరంగల్ - బల్లార్షకు బదులుగా విజయనగరం - రాయగడ - టిట్లాగఢ్ -రాయ్‌పూర్ - నాగ్‌పూర్ మీదుగా మళ్లించారు.

ఈ క్రమంలో 20805 విశాఖపట్నం - న్యూఢిల్లీ ఎపి ఎక్స్‌ప్రెస్, 20806 న్యూఢిల్లీ - విశాఖపట్నం - ఎపి ఎక్స్‌ప్రెస్ జూన్ 22 నుంచి జూలై 5 వరకు, 20803 విశాఖపట్నం - గాంధీధామ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 27, జూలై 5వ తేదీల్లోనూ, 20804 గాంధీధామ్ - విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 30 తేదీల్లోనూ, 12803 విశాఖపట్నం - హెచ్.నిజాముద్దీన్ స్వర్ణ జయంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 24, 28, జూలై 1, 5 తేదీల్లోనూ, 12804 హెచ్.నిజాముద్దీన్ - విశాఖపట్నం స్వర్ణజయంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 26, 30, జూలై 3 తేదీల్లోనూ, 20819 పూరీ - ఓఖా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 23, 30 తేదీల్లోనూ, 20820 ఓఖా - పూరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జూన్ 26, 30 తేదీల్లోనూ మళ్లించిన మార్గంలో నడుస్తాయని రైల్వే సీనియర్ డిసిఎం కె.సందీప్ తెలిపారు. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.



చంద్రబాబుకు అభినందనలు తెలుపుతున్న కనకారావు

బాబుకు జెఎస్‌డబ్ల్యు గ్రూపు అధినేత అభినందనలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : సిఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును మంగళవారం సాయంత్రం విజయవాడలో జెఎస్‌డబ్ల్యు గ్రూపు అధినేత కనకరావు రాచూరి మర్యాదాపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా ఇంటి అమ్మ వారి పండగ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 18వ వార్డులోని పెద్ద వారి ఇంటి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. భారీ సంఖ్యలో హాజరైన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ముఖ్య అతిథిగా హాజరై పెద్ద వారి ఇంటి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు కార్పొరేటర్ గొలగాని పోలారావు, టిడిపి సీనియర్ నాయకులు పెద్ద మసేను, పుక్కళ్ల ధనలక్ష్మి, గీతం రాజశేఖర్, గోకుల్ శ్రీను, వాసుపల్లి పోలారావు ఘన స్వాగతం పలికారు.

కలినరీ ఆర్ట్స్‌లో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ (తిరుపతి) ఆధ్వర్యంలో మూడు సంవత్సరాల కలినరీ ఆర్ట్స్‌లో బిబిఎ, 2 సంవత్సరాల ఎంబిఎ, 3 సంవత్సరాల బిఎస్‌సి హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.తిరులోగచందర్ తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ తిరుపతి, నొయిడాలో ఉన్న విద్యా సంస్థల్లో కలినరీ ఎడ్యుకేషన్ రంగంలో స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఇనిస్టిట్యూట్లు ఒకటన్నారు. ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్-తిరుపతి తన కార్యకలాపాలను 2016 ఆగస్టులో 25 మంది విద్యార్థులతో ప్రారంభించిందని, తక్కువ వ్యవధిలో ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ హాస్పిటాలిటీ ఇనిస్టిట్యూట్‌గా పేరుగాంచిందని తెలిపారు. 2018-19లో మంత్రిత్వ శాఖ నుంచి అవార్డు అందుకున్నామన్నారు. ఇనిస్టిట్యూట్‌లో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలైన వంటశాస్త్ర స్టూడియో, స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, ప్రత్యేకమైన కిచెన్లు, ఆధునిక పరికరాలతో కూడిన మైక్రోబయాలజీ లేబొరేటరీ, వివిధ వంటకాల కోసం శిక్షణా రెస్టారెంట్లు ఉన్నాయన్నారు. విద్యార్థులకు, అందునా బాలికలకు ఆధునిక హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. నిపుణులతో కూడిన బోధనా బృందం తమ సొంతమన్నారు. అడ్మిషన్ రిజిస్ట్రేషన్లు, ఫీజు మొదలైన వాటికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం, https://www.icitirupati.in ని చూడాలని కోరారు. 8108103478, 9985486271, 8106212224. నెంబర్ల ద్వారా పలు విషయాలు తెలుసుకోవచ్చునన్నారు. సమావేశంలో నొవాటెల్ చీఫ్ మాస్టర్ చెఫ్ మదీనా వల్లి పాల్గొన్నారు.

'జగన్ జైలుకు వెళ్లడం ఖాయం'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగన్ మోహన్ రెడ్డి త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమని, అందుకే అనేక మంది వైసిపికి గుడ్ బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి నేతలు ప్రస్తుత పరిస్థితులలో శరణమా, రణమా అన్నది తేల్చుకోవాలని అన్నారు. వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఆ పార్టీ ముఖ్య నాయకులు వీడ్కోలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సాక్షాత్తు నెల్లూరు మేయర్ వైసిపికి వీడ్కోలు పలికారని తెలిపారు. వైసిపిలో ముందు నుంచి జగన్మోహన్ రెడ్డి నియంత పాలన కొనసాగిందని, కనీసం ఆ పార్టీ ముఖ్య నాయకులకు కూడా అపాయింట్‌మెంట్ లభించేదికాదని అన్నారు. పార్టీ అధినేతతో ఇతర నాయకులు కలవకుండా ధనుంజయ రెడ్డి అడ్డుకునేవారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లోనే ఆ పార్టీ పతన దిశగా సాగిందన్నారు.

ఖరీఫ్‌కు ముమ్మర ఏర్పాట్లు

ఇప్పటికే 50 శాతం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

దశల వారీగా వరి సీడ్స్ పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం

ఏటా జూలై 12 నుంచి సెప్టెంబర్ 15 వరకు కొనసాగే ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ శాఖ అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. రైతులకు అవసరమైన పచ్చి రొట్ట విత్తనాలను ఇప్పటికే 50 శాతం మేర రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేశారు. మిగిలిన విత్తనాలు పూర్తి స్థాయిలో పంపిణీ చేయనున్నారు. భీమిలి మండలంలో పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగు 11.6 క్వింటాళ్ళు, కట్టి జనుము 5.5 క్వింటాళ్ళు, పిల్లి పెసర 2 1/2 క్వింటాళ్ళు, ఆనందపురం మండలంలో జీలుగు 16.2 క్వింటాళ్ళు, కట్టి జనుము 7.5 క్వింటాళ్ళు, పిల్లి పెసర 3.2 క్వింటాళ్ళు, పద్మనాభం మండలంలో జీలుగు 53.3 క్వింటాళ్ళు, కట్టి జనుము 23 క్వింటాళ్ళు, పిల్లి పెసర 4.3 క్వింటాళ్ళు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 50 శాతం మేరకు రైతులకు పంపిణీ చేసినట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయ ప్రసాద్ సోమవారం తనను కలిసిన ప్రజాశక్తికి తెలిపారు. భీమిలిలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో పచ్చి రొట్ట విత్తనాల్లో వంద గింజలు శ్యాంపిల్ తీసి పరీక్షలు చేశాక మొలక శాతం సంతృప్తికరంగా ఉన్నట్లు భావించాక వాటిని రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

సరిపడా వరి విత్తనాలు..

రైతులకు సరిపడా వివిధ రకాల వరి విత్తనాలు పంపిణీకి ఏర్పాట్లు చేశారు. భీమిలి మండలంలో ఎంటియు 1121 రకం 195 క్వింటాళ్ళు, బిపిటి 3291 రకం (సోనా మసూరి) 51 క్వింటాళ్ళు, బిపిటి 5204 రకం (సాంబ మసూరి) 67 క్వింటాళ్ళు, శ్రీకాకుళం సన్నాలు (ఆర్‌జిఎల్) 18 క్వింటాళ్ళు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆనందపురం మండలంలో ఎంటియు 1121 రకం 120 క్వింటాళ్ళు, బిపిటి 3291 రకం (సోనా మసూరి) 180 క్వింటాళ్ళు, బిపిటి 5204 రకం (సాంబ మసూరి) 60 క్వింటాళ్ళు, శ్రీకాకుళం సన్నాలు (ఆర్‌జిఎల్) 14 క్వింటాళ్లు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు. పద్మనాభం మండలంలో ఎంటియు 1121 రకం 885 క్వింటాళ్ళు, బిపిటి 3291 రకం (సోనా మసూరి) 447 క్వింటాళ్ళు, బిపిటి 5204 రకం (సాంబ మసూరి) 95 క్వింటాళ్ళు, శ్రీకాకుళం సన్నాలు (ఆర్‌జిఎల్ 2537) 5 క్వింటాళ్లు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు.

వరి పంట సాధారణ విస్తీర్ణం ఇలా...

మూడు మండలాల్లో వరి పంట సాధారణ విస్తీర్ణం ఇలా ఉంది. భీమిలి మండలంలో వరి పంట సాధారణ విస్తీర్ణం 1335 ఎకరాలు, ఆనందపురం మండలంలో 1572 ఎకరాలు, పద్మనాభం మండలంలో వరి పంట 7,619 ఎకరాలు సాగు చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తంగా 10,526 ఎకరాల్లో వరి పంట సాగుకు అవసరమైన పచ్చి రొట్ట విత్తనాలు, వరి విత్తనాలు పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు.

సకాలంలో వర్షాలు కురిస్తే...

సకాలంలో వర్షాలు కురిస్తే జూన్ నెలాఖారు లేదా జూలై మొదటి వారంలో వరి నార్లు వేసే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలో పూర్తిగా వర్షాధార వ్యవసాయ భూములు ఉన్నాయి. సమృద్ధిగా వర్షాలు పడితే చెరువులు, కుంటలు, గెడ్డల్లో పంట కాల్వల్లో నీరు చేరుతుంది. తద్వారా సాగుకు వీలుంటుంది.



ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు

గర్భిణుల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : గర్భిణులు నమోదుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగిన ఆశ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. గర్భిణులను మూడు నెలలలోపుగానే నమోదు చేయాలన్నారు. త్వరగా నమోదు చేయడం వల్ల అవసరమైన సేవలు అందించడానికి వీలుంటుందని చెప్పారు. అవసరమైన స్కాన్స్ జిల్లా వైద్య శాఖ గుర్తించిన స్కానింగ్ సెంటర్లలో చేయించాలని ఆదేశించారు. పిహెచ్‌సి వైద్యాధికారి నుంచి వచ్చే స్కాన్స్ చేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు తల్లీబిడ్డ వాహనం సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్తలు ఈ ఆశ యాప్‌ను ప్రతిరోజూ ఉపయోగించాలని ఆదేశించారు. కిల్కారీ మొబైల్ యాప్ సేవలు గర్భిణులకు ఉపయోగపడేలా, కిల్కారీ మొబైల్ నుంచి వచ్చే ఫోన్ వినేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. డయేరియా రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెద్దలకు బీసీజీ వాక్సినేషన్ కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. తొలుత నూతనంగా నిర్మితమవుతున్న భవనాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమావతి, ఎన్‌హెచ్ఎం పరిపాలన అధికారి రమేష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎం.గంగునాయుడు, షహనాజ్ సాధియా, జిల్లా కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, ఆరోగ్యకార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లవలస పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్ఒ

తగరపువలస : భీమిలి మండలం ఆర్ తాళ్లవలస పిహెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, బిసిజి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమావతి మంగళవారం సందర్శించారు. వైద్య, ఆరోగ్య పథకాలు, కార్యక్రమాలతో పాటు మే 16న ప్రారంభమైన బిసిజి టీకాల కార్యక్రమం అమలుపై సమీక్ష జరిపారు. మే 16 నుంచి ఇప్పటి వరకు సుమారు 2,700 మందికి బిసిజి టీకాలు వేసినట్లు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జునరావు వివరించారు. వైద్య, ఆరోగ్య పథకాల అమలు పట్ల డిఎం అండ్ హెచ్ఒ సంతృప్తి వ్యక్తం జేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'చంద్రబాబు హయాంలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి'

ప్రజాశక్తి -మధురవాడ : గత మూడు పర్యాయాల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు పరిపాలించిన సమయంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించిందని ప్రముఖ సామాజిక రాజకీయ విశ్లేషకులు డాక్టర్ ఊహ మహంతి తెలిపారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న చంద్రబాబుకు ఆమె శుభాకాంక్షలు తెలియజేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం మరింత సుస్థిర పరిపాలన, సమర్థవంతమైన అభివృద్ధిని పొందగలదని ఆకాంక్షించారు.



పనులను పరిశీలిస్తున్న జియ్యాని శ్రీధర్

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-కరాస : జివిఎంసి 52వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. జాతీయ రహదారిలోని సంజీవయ్యనగర్ గ్రీన్ బెల్ట్ పనులను, జిందాల్ భవన్ నుంచి మర్రిపాలెం ఉడా లే అవుట్ వరకు ఉన్న రోడ్డు డివైడర్ ఇరువైపులా జరుగుతున్న ఐరన్ గ్రిల్ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు డివైడర్ ఆధునీకరణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. వార్డులో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో వర్క్ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, సచివాలయ సెక్రటరీ అనూప్ పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రమాణస్వీకారానికి టిడిపి శ్రేణులు



పద్మనాభం నుంచి బయలుదేరిన తెలుగుదేశం శ్రేణులు

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల నుంచి తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు కె.నగేష్‌కుమార్ ఆధ్వర్యాన సుమారు 45 మంది కార్యకర్తలు, నాయకులు విజయవాడలో జరిగే చంద్రబాబు ప్రమాణస్వీకారానికి తరలి వెళ్లారు.

విశాఖ కలెక్టరేట్ : టిడిపి జిల్లా కార్యాలయం నుంచి చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి బయలుదేరిన బస్సులను ఆ పార్టీ విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అరాచక పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కపల్లి: ఈనెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవానికి కూటమి శ్రేణులు మంగళవారం తరలి వెళ్లారు. పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, కల్లేపల్లి బాబ్జి రాజు, మీగడ సత్తిబాబు, ప్రగడ వీరబాబు, కొంకిపూడి దొరబాబు, తోలేటి శ్రీనివాస్, కొప్పిశెట్టి వాసు, వంగలపూడి శ్రీను, కర్రి, వెంకట సత్యనారాయణ తదితరులు తరలి వెళ్లారు. ప్రమాణ స్వీకారోత్సవానికి తరలి వెళ్లేందుకు అధికారులు మండలానికి ఒక బస్సు కేటాయించారు. ఈ మేరకు ఎంపిడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు తరలి వెళ్లారు.

అనకాపల్లి : విజయవాడలో జరిగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం మహోత్సవానికి తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు మంగళవారం అనకాపల్లి పట్టణం రింగ్ రోడ్ జనసేన పార్టీ కార్యాలయం నుండి తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు మళ్ళ సురేంద్ర, గల్లా కొండలరావు, బుదిరెడ్డి చిన్న, మళ్ళ అమ్మాజీ, కెఎం నాయుడు, కొణతాల రమణబాబు, యల్లపు శ్రీనివాసరావు, దాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారానికి మండలంలోని పలు గ్రామాల నుండి తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు మంగళవారం కార్లు, బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ప్రభుత్వం అధికారికంగా ప్రతి మండలానికి ఒక బస్సును కేటాయించడంతో ద్వితీయ శ్రేణి నాయకులు ఆ బస్సులో వెళ్లారు.



నక్కపల్లి నుంచి బయలుదేరిన కూటమి నాయకులు

పూర్వ విద్యార్థుల కలయిక



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లి జడ్పీ హైస్కూల్‌లో 2005-06 సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మంగళవారం గుడిలోవ రిసార్ట్‌లో కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 19 సంవత్సరాల తరువాత సుమారు 30 మంది వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారందరూ ఒకేచోట కలుసుకున్నారు. ఒకరి కష్టసుఖాలను ఒకరు తెలుసుకున్నారు. భవిష్యత్తు కాలంలో ఒకరికొకరు తోడు ఉంటామంటూ భరోసా కల్పించుకున్నారు. భవిష్యత్తులో సామాజిక సేవా కార్యక్రమాలు చేయడానికి నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా సరదాగా క్రికెట్, డ్యాన్స్, స్విమ్మింగ్, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులు కొంతమంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దొంతల శ్రీరామ్, సవరవిల్లి అనిల్, కర్రోతు ధనలక్ష్మి, వెన్ని సురేష్, కంది జ్యోతి, ఉపాధ్యాయులు రమేష్ కుమార్, కరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

రామోజీకి గోపాలపట్నం సేవా పీఠం నివాళి

ప్రజాశక్తి -గోపాలపట్నం : తెలుగువారి ఔన్నత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన వ్యక్తుల్లో రామోజీరావు ముందు వరుసలో ఉంటారని గోపాలపట్నం సేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు సోములు అన్నారు. గోపాలపట్నంలోని సేవా పీఠం కార్యాలయంలో రామోజీరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సోములు మాట్లాడుతూ, రామోజీ ఒక మహా సాగరమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గోరకల రామదాసు, మాజీ అధ్యక్షులు చందు సుబ్బారావు, మాజీ ఉపాధ్యక్షులు కొంతం నూక రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు గంపల అప్పారావు, కోశాధికారి భాస్కర్ పాణిగ్రాహి, మాజీ ఉపాధ్యక్షులు మిద్దపురావు, సలహాదారులు రమణారావు, అందిపోయిన శ్రీనివాస్, తాండ్రంగి రామారావు, బల్ల రమణ తదితరులు పాల్గొన్నారు.



రామోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సేవా పీఠం సభ్యులు



డిఇఒ చంద్రకళకు వినతిపత్రం అందజేస్తున్న భాస్కరరావు

ప్లే స్కూల్స్ ముసుగులో ప్రైమరీ తరగతులపై ఫిర్యాదు

ప్రజాశక్తి -గాజువాక : ప్లే స్కూల్ ముసుగులో ప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్నారని విశాఖ జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) నాయకులు పాలవలస భాస్కరరావు మంగళవారం డిఇఒ ఎల్.చంద్రకళకు ఫిర్యాదు చేశారు. ప్లే స్కూల్స్ ముసుగులో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సిటీ పరిధిలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పూర్వ ప్రాథమిక తరగతులతో పాటు ప్రాథమిక తరగతులు కూడా నిర్వహిస్తున్నారని, అటువంటి విద్యార్థుల పేర్లు ఆన్‌లైన్‌లో కూడా నమోదు కావడం లేదని తెలిపారు. అధికారులు స్పందించి ఆయా స్కూళ్లపై తగు చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు కోరారు. డిఇఒను కలిసినవారిలో జాయింట్ సెక్రటరీ గిరీష్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, ఫణీంద్ర ఉన్నారు.



విద్యార్థులను సన్మానించిన కాలేజీ యాజమాన్య ప్రతినిధులు

రిసోనెన్స్ జూనియర్ కాలేజీ అద్భుత ఫలితాలు

ప్రజాశక్తి -గాజువాక : రిసోనెన్స్ జూనియర్ కాలేజీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్ క్రాంతికుమార్, డీన్ రాజశేఖర్ తెలిపారు. ఇటీవల విడుదలైన ఎన్ఐటి, ఐఐటి, జేఈఈ అడ్వాన్స్‌లో తమ కళాశాల విద్యార్థులు అత్యద్భుత ఫలితాలను సాధించారని పేర్కొన్నారు. 14 మందికి ఐఐటి, 16 మంది ఎన్ఐటిలో మంచి ర్యాంకులు సాధించారని తెలిపారు. జెఈఈ అడ్వాన్స్‌లో 30, 99, 1142, 1353, 1812, 2650, 3648, 4872, 4876, 5283, 8279, 9094, 13427 ర్యాంకులతో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని చెప్పారు. ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం తరుపున డైరెక్టర్లు భరత్ పరమాత్ముని, అనుపమ గూడురు, ప్రిన్సిపల్ క్రాంతికుమార్, డీన్ రాజశేఖర్, అధ్యాపకులు సౌరభ్, నాగేంద్ర, వైభవ్ కలిసి సత్కరించారు.

ఘనంగా గంగమ్మ తల్లి పండగ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఏటా ఫిషింగ్ హార్బర్‌లో జరిగే గంగమ్మ తల్లి ఉత్సవం ఈఏటా ఘనంగా సాగింది. వేట విరామ సమయం ముగిసి తిరిగి చేపల వేట ప్రారంభించే ముందు మత్స్యకారులు గంగమ్మకు పసుపు కుంకుమలతో మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి గంగమ్మకు పూజలు నిర్వహించారు.



గంగమ్మకు పూజలు చేస్తున్న మత్స్యకార మహిళలు

జివిఎంసి పార్కుల్లో ఉల్లాసం.. వ్యాయామం...



జివిఎంసి పార్కులో ఆడుకుంటున్న పిల్లలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎండలు మండుతున్న వేళ నగర జీవికి జివిఎంసి పార్కులు సేదదీరుస్తున్నాయి. వృద్ధులు, మహిళలు, పిల్లలు సాయంత్రం అయ్యేసరికి పార్కులకు చేరుకొని ఎంతో ఉత్సాహంగా గడుపుతున్నారు. 25వ వార్డు పరిధి గ్రీన్ బెల్ట్‌లో జివిఎంసి నిర్మించిన పార్కు, 26వ వార్డులోని లాల్ బహదూర్ శాస్త్రి పార్కు, 14వ వార్డులోని బృందావనం పార్కు, 43వ వార్డు పరిధి నందగిరినగర్ పార్కు, అబీనగర్‌లోని పార్కులు ఆయా ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పిల్లలు ఆడుకోవడానికి అత్యాధునిక పరికరాలు పార్కుల్లో ఉండడంతో వారి ఆనందానికి హద్దే లేకుండా పోతోంది. ఉయ్యాల, జారుడు బల్లలు ఉండటంతో పిల్లలు, వ్యాయామం చేసే పరికరాలు ఉండడంతో మహిళలు, పెద్దలు ఉత్సాహంగా వస్తున్నారు. పార్కుల్లో మంచినీటి సదుపాయంతో పాటు, ప్రతిరోజు పరిశుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులు ఉండడంతో వృద్ధులు వచ్చి సేద తీరుతున్నారు. ఉత్తర నియోజకవర్గంలోని పార్కులకు జివిఎంసి ఎంత ప్రాధాన్యత ఇచ్చింది. ప్రజలకు కూడా ఈ పార్కులను ఎంతో చక్కగా పరిశుభ్రం చేసుకుంటునారు. క్రమశిక్షణగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొన్ని పార్కుల్లో సాయంత్రం వేళల్లో సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యాన పిల్లలకు పద్యాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పిల్లలకు సెలవులు కావడంతో వారు ఎంతో ఉల్లాసంగా పాల్గొంటున్నారు.

ఉత్సాహంగా ఆటలాడుతున్న పిల్లలు

పార్కులో పిల్లలు ఆడుకోవడానికి వీలుగా జివిఎంసి పలు పరికరాలు ఏర్పాటుచేయడంతో వారు చక్కగా వినియోగించుకుంటున్నారు. పార్కులకు వచ్చే పిల్లలకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కనుమరుగవుతున్న కళలను గుర్తుచేస్తున్నట్లు ఉంది.

సూర్యనారాయణరాజు
బృందావనం కాలనీవాసి

వ్యాయామాలకు అనుకూలం

లాల్ బహదూర్ పార్కులో వ్యాయామం చేసుకునే విధంగా ఉండడంతో కాలనీ మహిళలు ఉత్సాహంగా వస్తున్నారు. వ్యాయామ పరికరాలను ఉపయోగించుకుంటున్నారు. ప్రతిరోజూ పార్కును పరిశుభ్రంగా ఉంచడం, మొక్కలకు నీరు పోయడం తదితర కార్యక్రమాలను నిర్వహించడం సంతోషకరంగా ఉంది.

వెంకటలక్ష్మి
లలితనగర్ వాసి



వ్యాయామాలు చేస్తున్న మహిళలు

నడక వంతెనను కూల్చితే ప్రజా ఉద్యమం

సిపిఎం నాయకులు బలివాడ వెంకటరావు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

ప్రజాశక్తి -గోపాలపట్నం : సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి చంద్రనగర్ వెళ్లే నడక వంతెనను కూల్చితే ప్రజా ఉద్యమం తప్పదని సిపిఎం గోపాలపట్నం డివిజన్ కార్యదర్శి బలివాడ వెంకటరావు హెచ్చరించారు. గోపాలపట్నంలోని సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రనగర్ వెళ్లే నడక వంతెనను కూల్చేందుకు రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నడకవంతెనను ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. ఇటీవల చంద్రనగర్ నుంచి బాజీ జంక్షన్ వెళ్లేందుకు రైల్వే ట్రాక్ మధ్యలో అండర్ పాత్ మార్గాన్ని రైల్వే శాఖ నిర్మించిందని, దీని వల్ల వాహన చోదకులకు ఉపయోగం తప్ప బాటసారులకు ఎటువంటి ప్రయోజనం లేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నడక వంతెనకు మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రజాభిప్రాయం తీసుకోకుండా నడక వంతెనను కూల్చితే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఐద్వా గోపాలపట్నం డివిజన్ కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ, సుమారు 14 గ్రామ ప్రజలు రాకపోకలు సాగించే నడకవంతెనను ఎట్లా కూల్చుతారని ప్రశ్నించారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే గణబాబుకు వినతిపత్రం సమర్పించామని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, ఒకసారి పరిశీలించి అధికారులతో మాట్లాడి సముచితమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆమె చెప్పారు. బుధవారం ఉదయం చంద్రనగర్ గ్రౌండ్‌లో ప్రజా ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.అనసూయ, పాలమ్మ, కాంతం తదితరులు పాల్గొన్నారు

ఎపిఇఎపి సెట్ ఫలితాల్లో విశాఖకు ర్యాంకులు

ఎపిఇఎపి సెట్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు సత్తాచాటారు. గాజువాక భానోజీతోటకు చెందిన శరగడం పావని రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించింది.

శశి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : ఎపి ఇఎపి సెట్-2024 ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యున్నత ర్యాంకులు సాధించినట్లు స్థానిక శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్రాంతి సుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చరల్ విభాగంలో కెఎంఎస్.ఫణి కుమార్ (59వ ర్యాంకు), కెటి షణ్ముఖశ్రీ సాయి (108వ ర్యాంకు), పి.హర్షిత (154వ ర్యాంకు), పి.చైతన్య కుమార్ (182వ ర్యాంకు) సాధించినట్లు పేర్కొన్నారు. వీరితో పాటు 1000 లోపు 17 ర్యాంకులు, 2000 లోపు 27 ర్యాంకులు, 3000 లోపు 39 ర్యాంకులు, 5000 లోపు 53 ర్యాంకులు సాధించారని తెలిపారు.

ఇంజినీరింగ్ విభాగంలో... ఎస్.దిలీప్ వెంకట సతీష్ 165వ ర్యాంకు, సిహెచ్ వరుణ్ నాగ సాయి నారాయణ 331వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు 1000 లోపు 15 ర్యాంకులు, 2000 లోపు 43 ర్యాంకులు, 3000 లోపు 73 ర్యాంకులు, 5000 లోపు 110 ర్యాంకులు, 10,000 లోపు 173 ర్యాంకులు, 15,000లోపు 220 ర్యాంకులు, 20,000 లోపు 260 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. వీరందరినీ అభినందించారు



పావని

పావనికి 9వ ర్యాంకు

ప్రజాశక్తి -గాజువాక : ఎపి ఇఎపి సెట్ ఫలితాల్లో అగ్రికల్చర్ విభాగంలో బానోజీ తోటకు చెందిన శరగడం పావని రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంకు సాధించింది. పావని తండ్రి గంగారావు అదాని గంగవరం పోర్టులో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తల్లి గృహిణిగా ఉన్నారు. పావని మంచి ర్యాంకు సాధించడంతో తండ్రితో పాటు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానిక కాలనీ ప్రజలు ఆమెను అభినందించారు. పదో తరగతి వరకు భాష్యంలోనూ, ఇంటర్మీడియట్ బైపిసి గ్రూపులో శ్రీ చైతన్య కాలేజీ కూర్మన్నపాలెం బ్రాంచిలో చదివారు. రోజుకు 13 గంటలు కష్టపడి చదివానని ఈ సందర్భంగా పావని తెలిపారు.

విద్యా కానుక కిట్ల నాణ్యతపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యా కానుక కిట్ల నాణ్యతపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వం ప్రచారానికి ఇచ్చిన ప్రాధాన్యత స్కూల్ బ్యాగ్‌లు, బెల్టులు, షూల నాణ్యతపై లేదని విమర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందించే విద్యా సామగ్రి నాణ్యతగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

13 నుంచి స్కూల్ బస్సుల తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 13 నుంచి పాఠశాలలు పున్ణ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలల బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు రవాణాశాఖ ఉప కమిషనర్ రాజారత్నం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయడంతో పాటు సంబంధిత విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. తనిఖీలు ఈ నెల 13 నుంచి 30 వరకూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1089 స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేశామని తెలిపారు.

15న పిఎన్ఎం ఆధ్వర్యాన శ్రీశ్రీ వర్ధంతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన ఈ నెల 15న సాయంత్రం ఐదు గంటలకు బీచ్ రోడ్డులోని శ్రీశ్రీ విగ్రహం వద్ద శ్రీశ్రీ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చంటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'సాపాటు ఎటూ లేదు. పాటైనా పాడు బ్రదర్' శీర్షికతో పిఎన్ఎం బ్యాండ్ కార్యక్రమాన్ని ఆ రోజు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న గాయకులు పాల్గొని అభ్యుదయ, దేశభక్తి, శ్రీశ్రీ పాటలు పాడవచ్చునని తెలిపారు. ట్రాక్‌పై పాడాల్సి ఉంటుందని, ట్రాక్ తెచ్చుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను బుధవారం సాయంత్రం 5 గంటలలోగా 9100550706, 8499096699 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని అభివృద్ధి చేయాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి



యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి -అనకాపల్లి

నూతన ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి పేర్కొన్నారు. అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో జరిగిన యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా కొలువు తీరనున్న ప్రభుత్వం ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. అందుకు జీవో 117ను రద్దు చేయాలన్నారు. గత ప్రభుత్వం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేసిందని, ఆ పద్ధతిని వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఉన్న మాదిరిగా మూడంచెల విధానంలోనే పాఠశాలలను ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు కట్టా శ్రీను, గాయత్రి, కోశాధికారి జోగా రాజేష్, జిల్లా కార్యదర్శులు చంద్రరావు, జివిస్ ప్రకాష్, చైతన్య, శేషుబాబు, రాష్ట్ర కౌన్సిలర్‌లు ఎల్లయ్యబాబు, ఎంవి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ సుజాత, ముత్యాలు

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని ముత్యాలమ్మపాలెం పంచాయతీ పరిధిలో వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు ఆ పంచాయతీ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు దంపతులు మంగళవారం రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. జాలరిపేట గ్రామంలో కంబాల ముత్యాలు అనే మత్స్య కార్మికుడు ఇటీవల చేపల వేట చేస్తుండగా పిడుగుపాటుకు గురై మృతి చెందారు. ఆయన కుటుంబానికి రూ.25 వేలు, ఇటీవలే దిబ్బపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చింతకాయల అప్పన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన కుటుంబానికి రూ.25 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, ఎంపీటీసీ సభ్యులు అర్జిల్లి దేవి రవి, మాజీ ఎంపీటీసీ సభ్యులు చింతకాయల అమ్మోరు, పిఎసి మాజీ డైరెక్టర్ సురాడ ముత్యాలరావు, జాలారిపేట మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఓలిశెట్టి తాతారావు, సీనియర్ నాయకులు సమ్మింగి సోమేశ్వరావు, జాలారిపేట పూజారి ఒలిశెట్టి జోగారావు, ఒకటో వార్డ్ మెంబర్ ఒలిశెట్టి పోలమ్మ, కంబాల గురువోజీ, కంబాల మసేను, సమ్మంగి అప్పలరాజు, సమ్మంగి ముత్యాలు, జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



లోకేష్‌కు వెంకటేశ్వరసామి చిత్రపటాన్ని అందిస్తున్న నాగజగదీష్

లోకేష్‌ను సత్కరించిన నాగజగదీష్

ప్రజాశక్తి -అనకాపల్లి

ఇటీవల శాసనసభ ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం నుండి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను మంగళవారం ఉండవల్లిలో ఆయన స్వగృహంలో టిడిపి మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే దిశగా కూటమి నుంచి గెలుపొంది కేంద్ర పదవులు పొందిన వారు పనిచేయాలని కాంగ్రెస్ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త బోయిన భానుమూర్తి యాదవ్ అన్నారు. అనకాపల్లి న్యూ కాలనీలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపి, బిజెపి పార్లమెంట్ సభ్యులకు కీలకమైన మంత్రిత్వ శాఖలు దక్కడం ఆనందదాయకమన్నారు. తెలుగు రాష్ట్రాలలో అత్యంత కీలకమైన విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకొనే భాధ్యత పరిశ్రమలు, ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మపై ఉందన్నారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మలపు రెడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్‌డిఎ కూటమిలో అత్యంత కీలకమైన భాగస్వామిగా ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేయాలని, రాష్ట్రానికి రావలసిన నిధుల విషయంలో అలుపెరగని పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిఎస్.దత్తు, సేనాపతి ఈశ్వర రావు(రాజు), కత్తెర శ్రీధర్, తూట్టా రమణ, సూరా శ్రీనివాస్, కోట్ని మాణిక్యం పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఉపాధి హామీకి బడ్జెట్ పెంచాలి



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు బ్రహ్మాజీ

ప్రజాశక్తి- మునగపాక

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ పెంచి కూలీలకు ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 చెల్లించాలని సిఐటియు మండల కన్వీనర్ ఎస్.బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. స్థానిక పెద్ద మదుమ్ ప్రాంతంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలను మంగళవారం ఆయన కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో వారు పడుతున్న ఇబ్బందులను బ్రహ్మాజీ గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల జీవనాధారంగా ఉన్న ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో కోత పెట్టి నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పనులకు గతంలో రూ.90 వేల కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు రూ.40 వేల కోట్లకు కుదించడం అన్యాయమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలి 300 రూపాయలు కుటుంబం గడవడానికి ఎటూ సరిపోలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో టెంట్లు లేక ఎండ వేడిమికి తాళలేక ఉపాధి కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పని ప్రదేశంలో టెంట్లు వేయాలని, మంచినీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించాలని, పని ప్రదేశంలో గాయపడిన కూలీలకు వైద్య సౌకర్యం కల్పించాలని, పనిముట్లకు అద్దె చెల్లించాలని, ప్రమాద బీమా రూ.ఐదు లక్షలు ఇవ్వాలని బ్రహ్మాజీ డిమాండ్ చేశారు.

కూటమితో రాష్ట్రం అభివృద్ధి

ప్రజాశక్తి -అనకాపల్లి

ఎన్డీఏ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గం కార్యదర్శి మల్ల గణేష్ పేర్కొన్నారు. గవరపాలెం సంతోషిమాత ఆలయం వద్ద మంగళవారం కూటమి జరిగిన 19వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేకు కటింగ్ చేసి అందరికీ పేరుపేరునా తినిపించి ఒకరికొకరు అభినందనలు తెలియజేసుకున్నారు. తెలుగుదేశం జనసేన బిజెపి ఇచ్చిన హామీలు ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అందరికీ అందే విధంగా కృషి చేస్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్ల రామకృష్ణ, పీలా రమణారావు, మద్దాల వరహ నూకేశ్వరరావు, మల్ల జగదీష్, బొడ్డేడ నూకరాజు, మల్ల మోహన్, మద్దాల శ్రీనివాసరావు, ఆళ్ల గోవింద, దొడ్డి శ్రీనివాసరావు, దాడి వాసు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వాలీబాల్, త్రోబాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ



ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న ఎన్‌టిపిసి యాజమాన్య ప్రతినిధులు

ఎన్టీపీసీ సింహాద్రి ఐఆర్ఎస్ఎం వాలీబాల్, త్రో బాల్ టోర్నమెంట్‌ను సోమవారం దీపాంజలినగర్‌లోని స్పోర్ట్స్ గ్రౌండ్, వాలీబాల్ కోర్ట్‌లో ప్రారంభించారు. క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా ఎన్టీపీసీ సింహాద్రి ఐఆర్ఎస్ఎమ్ వాలీబాల్, త్రోబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎన్టిపిసి సింహాద్రి ప్రాజెక్టు హెడ్ ఎస్‌కె.సిన్హా ప్రారంభించారు. ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో రామగుండం తెలంగాణ, కుడ్గి, సదరన్ రీజియన్ హెచ్‌క్యూ, సింహాద్రి నాలుగు ఎన్టీపీసీ స్టేషన్‌ల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా సింహాద్రి హెడ్ సిన్హా ట్రోఫీలను ఆవిష్కరించి, స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. కార్యక్రమంలో సీజీఎం ఆర్ఆర్.పరిదా, ఎస్‌జె, జిఎం డేవిడ్, శ్రకాంబ్లే, ఎస్ పద్మప్రియ, హెచ్‌ఓహెచ్ ఆర్‌బిబి పాత్ర, స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి

స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద స్థానిక సర్పంచ్ సబ్బవరం పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి చేతుల మీదుగా మంగళవారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు కావలసిన రకం వరి విత్తనాలు ఆర్బికే కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని, కావలసిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకొని విత్తనాలు పొందాలని సూచించారు. ఆర్‌జెఎల్ 66 క్వింటాలు, ఎంటియు 1121 -36 క్వింటాలు, సాంబ మసూరి 30 క్వింటాలు, అమర్ 16 క్వింటాలు ఉన్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది కాటిపాము సత్యారావు, భాగ్యశ్రీ, వార్డు మెంబర్లు కొల్లి ఈశ్వరరావు, బంధం అప్పలరాజు, గుల్లిపల్లి మురళి, పరవాడ అప్పారావు రైతులు పాల్గొన్నారు.



రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : ఎలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి సిరిదెల్ల శ్రీనివాస్ రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందిన నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. తనకి అవకాశం కల్పించిన వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజుకు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికల్లో యలమంచిలి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సుందరపు విజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



విలేజ్ హెల్త్ క్లినిక్‌లో సేవలు అందిస్తున్న దృశ్యం

శిశు మరణాల నివారణ లక్ష్యంగా కృషి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మాతా శిశు మరణాల నివారణ లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని అనకాపల్లి జిల్లా టాస్క్ ఫోర్స్ ప్రధాన అధికారి డాక్టర్ లూసీకార్డిలియా ఆదేశించారు. పెదపాడు గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంగళవారం డాక్టర్ లూసీకార్డిలియా, టాస్క్ ఫోర్స్ బృందంలోని జిల్లా గణాంక అధికారి రామచంద్రరావు, డిపిఓ జగదీష్, డిపిహెచ్‌ఎన్ఓ నాగమణి, ఐడిఎస్పి కోఆర్డినేటర్ జనార్దన్ తదితరులు సందర్శించి అక్కడ సిబ్బంది పనితీరు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా లూసీకార్డిలియా మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో మరణించకూడదని, వైద్య సదుపాయాలు సకాలంలో అందించి రక్తహీనత సమస్య లేకుండా చూడాలని కోరారు. ప్రతి కాన్పు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగేలా చూడాలన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లో క్షేత్రస్థాయి వైద్య రికార్డులు పరిశీలించి ధ్రువీకరించారు. ఈ కార్యక్రమంలో హరిపాలెం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ ఎ.వసంత కుమార్, ఎంపిహెచ్ఈఓ సూరిశెట్టి శ్రీనివాస్, హెచ్ఈ రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేష్, వైద్య సిబ్బంది నాగేశ్వరరావు, శివమ్మ, నాగలక్ష్మి, రమ్య, గాయత్రి, మహాలక్ష్మి, దేవుడమ్మ, ఆశా కార్యకర్తలు మణి, విజయ, పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ప్రభుత్వ పాఠశాలల్లో చక్కనైన విద్యాబోధన, ఉచిత పుస్తకాలు, సంపూర్ణ ఆహారం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్న నేపథ్యంలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సీనియర్ ఉపాధ్యాయులు బడారపు కృష్ణ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని వార్మగూడెం, అమీనాబాద్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించాలంటూ ఉపాధ్యాయులు కృష్ణ ఆధ్వర్యాన మంగళవారం పలు గ్రామాల్లో విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యాబోధన, ప్రత్యేక వసతులు, డిజిటల్ తరగతులు వంటి సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు.

వాకర్స్ క్లబ్‌లు ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : నానాటికీ ప్రజలు ఆరోగ్యంపై దృష్టి మళ్లిస్తున్న నేపథ్యంలో వాకర్స్ క్లబ్‌లు ఆ దిశగా కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా వాకర్స్ క్లబ్ గవర్నర్ టి.రంగారావు సూచించారు. అనకాపల్లి ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్‌లో అనకాపల్లి వాకర్స్ క్లబ్, ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ వాకర్స్ క్లబ్, తుమ్మపాల వాకర్స్ క్లబ్ సభ్యులతో మంగళవారం చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి కేబినెట్ మీటింగ్ గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో విశాఖ నుంచి బలిరెడ్డి సత్యనారాయణ, కేబినెట్ సెక్రటరీ జి.సూర్యనారాయణ, ఎసిహెచ్ అప్పారావు, కేబినెట్ జాయింట్ సెక్రటరీ, జె.పురుషోత్తం, ఎంజిఎఫ్ కోఆర్డినేటర్లు, అనకాపల్లి వాకర్స్ క్లబ్ నుండి భీశెట్టి రామకృష్ణ, రాపేటి నారాయణ రావు, డాక్టర్ డిడి నాయుడు, ఆడారి మల్లికార్జునరావు, వై సత్యనారాయణ, కె వీరభద్రరావు, కాండ్రేగుల నూకరాజు, కె రమణ, అప్పారావు, కాండ్రేగుల జగ్గారావు, కర్రి శివ, పి.శంకరబాబు, పి భాస్కరరావు, ఎం.దిలీప్, తుమ్మపాల వాకర్స్ క్లబ్ నుండి పిల్లా హర శ్రీనివాసరావు, వై సత్యనారాయణ, ఎం మహేష్, కె బాబూరావు, పి అప్పారావు, ఎన్ వాసు పాల్గొన్నారు.



అనకాపల్లి వాకర్స్ క్లబ్‌ను సందర్శించిన గవర్నర్ రంగారావు

దొంగ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

దొంగ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలం, కోనాం శివారు కొత్తవీధి కొందు పివిటిజి ఆదివాసీలు మంగళవారం విశాఖపట్నంలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కోనాం గ్రామంలోని సర్వే నెంబర్ 289-1ఎలో 8 ఎకరాల సీలింగ్ మిగులు భూములను కలుపుకొని 37 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేశారని, ఆ సమయంలో పని చేసిన చీడికాడ మండల తహశీల్దారు, మాడుగుల సబ్ రిజిస్ట్రార్ భూమాఫియాతో చేతులు కలిపి, ప్రభుత్వ ఆస్తిని ప్రైవేటు ఆస్తిగా చూపించి అక్రమాలకు పాల్పడ్డారని డిఐజి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పిఎస్. అజయ్ కుమార్ మాట్లాడుతూ నిషేధపు ఉత్తర్వుల పుస్తకంలో ఉన్న రూ.50 లక్షల విలువైన 8 ఎకరాల సీలింగ్ మిగులు భూమిని జిరాయితీ భూమిగా చూపిస్తూ రికార్డుల్లో మార్పు చేశారని, వాటిని ముందు పెట్టుకొని మాడుగుల సబ్ రిజిస్ట్రార్ ఐదు రిజిస్ట్రేషన్లు చేశారని పేర్కొన్నారు. దీంతో ఆ భూములలో సాగులో ఉన్న ఆదివాసీలు విజయవాడలోని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాలపై జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి విచారణ జరిపారని అజయ్ కుమార్ గుర్తు చేశారు. ఈ విచారణలో జరిగిన అక్రమాలు బయటపడినప్పటికీ నేటికీ దస్తావేజులను రద్దు చేయడం గాని, రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవడం గాని, రికార్డును తారుమారు చేసిన తాసిల్దార్‌ను విధుల నుండి తొలగించడంగాని జరగలేదని వాపోయారు. 2023 జూలై నెలలోనే చర్యలు తీసుకోమని కోరుతూ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారని, ఇప్పటికి 11 నెలలు గడుస్తుందని కానీ ఎలాంటి చర్యలు లేవని పేర్కొన్నారు. ఈలోగా భూ మాఫియా ఈ భూములను అమ్మి వేయడానికి ప్రయత్నం చేస్తుందని, సాగులో ఉన్న ఆదివాసీలను భయభ్రాంతులు చెందుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అనకాపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తరతరాలుగా భూమిని నమ్ముకుని జీవిస్తున్న పివిటిజి ఆదివాసీల సాగు హక్కులను నమోదు చేయాలని, వారి సాగుబడికి రక్షణ కల్పించాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న అజయ్‌కుమార్, గిరిజనులు

హత్య కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి-అనకాపల్లి

హత్య కేసులో ముద్దాయికి 10 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, పది లక్షల రూపాయల జరిమానా విధిస్తూ విశాఖపట్నం పిడిజె కోర్టు తీర్పు ఇచ్చినట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం వెల్లడించారు. ఎస్పి తెలిపిన వివరాలు ప్రకారం... అనకాపల్లి జిల్లా నాతవరం మండలం శృంగవరం గ్రామానికి చెందిన పైల రమణ, సుర్ల వెంకటరమణకు మధ్య ఎంతోకాలంగా భూతగాదాలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో 2014 అక్టోబర్ 25న సుర్ల వెంకటరమణ తన వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసేందుకు ఎ.శరభవరం సంతకు వెళ్ళాడు. ఈ విషయాన్ని గమనించిన పైల రమణ ఆయన్ను అనుసరించాడు. వెంకటరమణను హత్య చేయాలన్న ఉద్దేశంతో పైల రమణ గొడవకు దిగి రాయితో ముఖం పైన తలపైన తీవ్రంగా కొట్టి గాయపర్చాడు. దీంతో సుర్ల వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై మృతుని తల్లి చిన్నమ్మలు నాతవరం పోలీస్ స్టేషన్‌లో నాడు ఫిర్యాదు చేసింది. డీజీపీ ఆదేశాల మేరకు ప్రయారిటీ కేసుల్లో భాగంగా ఎస్పీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నేరం రుజువు కావడంతో పిడిజె కోర్టు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు 10 లక్షల రూపాయల జరిమానా విధించింది. జరిమానాల్లో తొమ్మిది లక్షల 50వేల రూపాయలు మృతుని కుటుంబానికి, 50 వేల రూపాయలు ప్రాసిక్యూషన్ ఖర్చులు నిమిత్తం జరిమానా విధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పిపి కాండ్రేగుల జగదీశ్వరరావును, పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

ఘనంగా కల్కి సినిమా ట్రైలర్ విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన కల్కి చిత్రం ఈ నెలాఖరులో థియేటర్లో విడుదలవుతున్న సందర్భంగా మంగళవారం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. అనకాపల్లి సత్య నారాయణ థియేటర్లో వందలాదిమంది ప్రభాస్ అభిమానుల కేరింతల నడుమ అట్టహాసంగా ట్రైలర్ విడుదల చేశారు. హాలీ వుడ్ స్థాయిలో వున్న ఈ ట్రైలర్ చూసిన అభిమానులు ఆనందానికి అవధులు లేవని హర్షం వ్యక్తం చేశారు. ఈ సినిమా చరిత్ర సృష్టించడం ఖాయమంటున్నారు. అనకాపల్లి పట్టణ ప్రభాస్ ఫ్యాన్స్ గౌరవ అధ్యక్షులు ఆళ్ల ప్రవీణ్ కుమార్, అధ్యక్షులు జివిఎల్‌ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల జోగేంద్ర, కోశాధికారి కొణతాల అరవింద్ సమక్షంలో థియేటర్ అధినేతలు కొణతాల రామ లింగస్వామి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బుద్ద శ్రీను, ఏజెంట్ సురేష్, అభిమాన సంఘం నాయకులు కాండ్రేగుల జోగేంద్ర, కొణతాల అరవింద్, అశోక్, చింతల ధర్మేష్, కొణతాల మనోజ్, ఉమ్మలాట కార్తీక్, చంటి, సతీష్ వర్మ, నారి శివయ్య, బుద్ద మనోహర్, కె.శ్రీనివాస్ వందలాది మంది ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.



కల్కి మూవీ ట్రైలర్‌ను విడుదల చేస్తున్న ప్రభాస్ అభిమానులు

తాళ్లమ్మ తల్లికి కూటమి నేతల పూజలు

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్ : యలమంచిలి ఎమ్మెల్యేగా సుందరపు విజయకుమార్ విజయం సాధించడంతో మండలంలోని పోతిరెడ్డి పాలెం గ్రామ దేవత తాళ్లమ్మ తల్లికి కూటమి నాయకులు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు బొద్దపు శ్రీనివాసరావు, టిడిపి నాయకులు ఇత్తంశెట్టి సన్యాసి నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సన్యాసమ్మ, పోలమాంబలకు పూజలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక గ్రామ దేవత సన్యాసమ్మ, పోలమాంబ తల్లులకు కూటమి కార్యకర్తలు మొక్కులు చెల్లించారు. మంగళవారం ఆయా గుడుల వద్ద హనుమాన్ యూత్, లవ్ లీ యూత్ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి గెలిచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మొక్కుబడి చెల్లించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, గుల్లిపల్లి మురళి, సబ్బవరపు మాలిబాబు, కొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డిఇఒను కలిసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

మెరిట్ విద్యార్థులకు డిఇఒ అభినందనలు

ప్రజాశక్తి- మునగపాక

ఇటీవల పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ జూనియర్ స్వశక్తి విభాగంలో ఎంపికైన మండలంలోని తోటాడ జెడ్పి హైస్కూల్ విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ అభినందించారు. ఈ మేరకు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు ఎన్‌విఎస్ సోమయాజులు, విశ్రాంత హెచ్‌ఎం బి.కుమార్‌ల సమక్షంలో సదరు విద్యార్థులు లావేటి హాసిని, ఆడారి వేణుశ్రీ, యల్లపు శ్రావ్య మంగళవారం డీఈవోను కలిశారు. ఈ సందర్భంగా వారికి డిఇఒ మెమెంటోలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయనటానికి ఈ ముగ్గురు విద్యార్థులే నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో వై.వెంకటేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయులు సిహెచ్.రామకృష్ణ మూర్తి, సీఆర్పీ మద్దాల గోవింద తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఏపిలో ఏర్పాటు కానున్న కొత్త ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండలంలోని మూలపేట గ్రామంలో మంగళవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం సంఘం గ్రామ అధ్యక్షులు సిహెచ్. అప్పలరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాకముందు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వివిధ పథకాలు అమలులో ఉన్నాయని, జగన్ అధికారంలోకి రాగానే నవరత్నాల పేరుతో అవన్నీ తొలగించి కార్మికులను మోసం చేశాడని విమర్శించారు. ఇసుక కొరత సృష్టించి కార్మికుల ఆకలి చావులకు, అప్పులకు కారకుడయ్యారన్నారు. సంక్షేమ బోర్డు నుండి రూ.1600 కోట్లు తీసుకున్నారని తెలిపారు. బోర్డు సభ్యులకు క్లెయిమ్‌లు చెల్లించకుండా కార్మికులను తిప్పలు పెట్టారన్నారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మారేడు పూడి సత్యనారాయణ, పల్ల నాగరాజు, తోట రాజు, ఉప్పిలి ఆదినారాయణ, శేషు, ఎమ్.రాము, తోట ఈశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మంజూరు కాని నిధులు..

నిలిచిన రహదారి నిర్మాణ పనులు

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రోడ్డుపై పిక్క తేలిన కొర్రవాని పాలెం రోడ్డు



అసంపూర్తిగా నిలిచిన మనవానిపాలెం రోడ్డు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మనవానిపాలెం, కొర్రవానిపాలెం గ్రామాలకు వెళ్లే తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో అసంపూర్తిగా నిలిచి పోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఎన్నో ఏళ్ల నుంచి ఈ రెండు గ్రామాల ప్రజలు రహదారి సక్రమంగా లేనందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే చాలు రోడ్డంతా బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు.ముఖ్యంగా కొర్రవానిపాలెం రోడ్డు చాలా అధ్వానంగా ఉండటంతో గ్రామంలో ఎవరైనా జబ్బు వచ్చి మంచాన పడినా, గర్భిణీలను ఆసుపత్రికి తీసుకువెళ్లాలన్నా కనీసం అంబులెన్స్ కూడా రాని పరిస్థితిలో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు గ్రామాల ప్రజలు రోడ్డు కోసం ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొర పెట్టుకొని రోజులుంటూ లేవు.

ఈ నేపథ్యంలో గత వైసిపి ప్రభుత్వం హయాం లో ఏషియన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఇన్ వెస్ట్ మెంట్ బ్యాంక్ ఆర్థిక సహాయంతో రెండు గ్రామాలకు తారు రోడ్డు మంజూరు చేశారు. గత ఏడాది ఫిబ్రవరి 6న అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబురావు రోడ్డు నిర్మాణాలకు సంబంధించి శిలాఫలకం ఆవిష్కరించి, రోడ్డు పనులు



రోడ్డు పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న గొల్ల బాబూరావు (ఫైల్ ఫొటో)

ప్రారంభించారు. రోడ్డు పనులు ప్రారంభంతో ఎన్నో ఏళ్ల కళ నెరవేరిందని రెండు గ్రామాల ప్రజలు ఆనంద పడ్డారు.ఎస్.నరసాపురం రోడ్డు నుండి కొర్రవానిపాలెం రోడ్డుకు రూ.84.60 లక్షలు, ఉపమాక నుండి మనవానిపాలెం గ్రామం మీదుగా జాతీయ రహదారి వరకు సుమారుగా కిలోమీటన్నర రోడ్డుకు రూ.110.5 లక్షల అంచనా నిధులతో రోడ్డు టెండర్ వర్క్సు కాంట్రాక్టర్ ప్రారంభించారు. రెండు గ్రామాలకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి, జిఎస్‌బి లేయర్ వరకు పనులు కొనసాగించి, తారు వేయకుండా అసంపూర్తిగా రోడ్డు నిర్మాణ పనులను నిలుపుదల చేశారు. తారు వేయకుండా పనులు నిలుపుదల చేయడంతో నల్ల పిక్క అంతా పైకి రేగిపోవడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బైక్, సైకిల్ పై వెళ్లేవారు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను అసంపూర్తిగా నిలుపుదల చేసినట్లు తెలిసింది. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



గ్యాస్ ఏజెన్సీ కేంద్రం వద్ద వినియోగదారులు

గ్యాస్ ఏజెన్సీ కిటకిట

- ఉచిత గ్యాస్ కోసం రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి -కోటవురట్ల:కూటమి ప్రభుత్వం ఏర్పడితే ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వనుండటంతో కేవైసీ తప్పనిసరి కావడంతో మండలంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద వినియోగదారులు క్యూ పడుతున్నారు. గడిచిన వారం రోజులుగా గ్యాస్ ఏజెన్సీల వద్ద సందడి వాతావరణం నెలకొంది. మండలంలో ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఒకటే ఉంది. అదే విధంగా మండలంలో భారత్, హెచ్పి గ్యాస్ ఏజెన్సీ వినియెగదారులు కూడా ఎక్కువ మంది ఉన్నారు. భారత్ ఏజెన్సీ మాకవరపాలెంలోనూ, హెచ్‌పి ఏజెన్సీ నర్సీపట్నంలో ఉంది. వీరంతా అక్కడికి వెళ్లి చేసుకోవాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుంది. మండలంలో కేవైసీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భారత్, హెచ్‌పి వినియోగదారులు కోరుతున్నారు.



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని చినతీనార్ల గ్రామంలో మంగళవారం అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను నిర్వాహకులు కంబాల అమ్మోరియ్య, కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తుల తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

జి.కొత్తపల్లిలో విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- చీడికాడ :ఖరీఫ్ సీజన్ దగ్గరవుతుండటంతో సబ్సిడీపై రైతులకు విత్తనాల పంపిణీ చేశారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కొల్లి సూరినాయుడు రైతులకు పలు రకాల విత్తనాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పవిత్ర, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు



అధ్వాన్నంగా ఉన్న రోడ్డు

అస్తవ్యస్తంగా రహదారులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పల్లాపురం, పాతకృష్ణదేవిపేట, ఏఎల్ పురం, రామచంద్రపురం, కొంగసింగి, లింగంపేట, చోద్యం తదితర గ్రామాల తారురోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఇప్పటికే గోతులు పడిన రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వాన్నంగా మారాయి. ఈ గోతుల్లో వర్షపు నీరు నిలిచి పోవడంతో రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోతుల వద్ద వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చీడిగుమ్మల పంచాయతీ యరకంపేట గ్రామంలో సోమవారం రాత్రి రెండు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పట్నాల సన్నిబాబు, గజ్జి రాజబాబుకు చెందిన రెండు పశువుల పాకలు దగ్ధం కావడంతో గ్రామస్థులు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఎవరో గుర్తు తెలియని వారు దగ్ధం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉదయం గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల వెంకట గిరిబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి లెక్కల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ కొసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రోలుగుంట:జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో రోలుగుంట కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రోలుగుంటలో ఈ నెల 12న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సహకారంతో ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు సంబంధించిన ఉచిత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమిష్టి తత్వానికి ప్రతీక భూమి పండగ

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు ప్రతి సంవత్సరం జూన్ నెలలో నిర్వహించుకునే భూమి పండగ సమిష్టి తత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆదివాసీ గిరిజనులు తమ మొదటి పండుగ అయిన భూమి పండుగను ఎవరి ఇంట్లో వారు కాకుండా చిన్నా పెద్ద తేడా లేకుండా ఊరు ఊరంతా కలిసి సమిష్టిగా కలిసి చేసుకుంటారు. ప్రతి ఏటా తొలకరి ప్రారంభంలో ప్రకృతి పచ్చదనంతో నిండిన సమయంలో ఆదివాసీలు తమ ఆచార, సంస్కృతీ సంప్రదాయాలకు అనుగుణంగా ఊరి జనమంతా సమావేశమై భూమి పండుగ ఎప్పుడు చేయాలో గ్రామ పెద్దలు, పూజారి పటేల్‌లతో చర్చించి నిర్ణయిస్తారు.

భూమి పండుగ చేయకుండా తమ గ్రామంలో కానీ ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలు మిగతా ఏ పండుగలను, ఉత్సవాలను నిర్వహించారు. తమ కులదైవాలను కూడా భూమి పండుగ తర్వాతనే కొలుస్తారు. ఈ పండుగ ప్రత్యేకత ఏమిటంటే.., గ్రామంలో ఉన్న పురుషులందరూ విల్లంబులు పట్టుకుని సమీప అడవుల్లో జంతువుల వేటకై వెళతారు. వేటకు వెళ్లే తమ గ్రామ యువకులకు మహిళలు ఎదురెళ్లి తిలకాలు దిద్ది క్షేమంగా వెళ్లి వేటతో లాభంగా రావాలని కోరుతూ ఆదివాసీ గీతాలను ఆలపిస్తూ సాగనంపుతారు. మగవారు అలా అడవికి వెళ్ళిన అనంతరం గ్రామంలో ఉన్న మహిళలందరూ కలిసి సమిష్టిగా రహదారులపై అడ్డంగా కర్రలు పట్టుకొని ఒకరినొకరు గొలుసుల పట్టుకొని సామూహిక నృత్యం చేస్తూ వాహనాలను ఆపుతూ రేలా పాటలు పాడుతూ భూమి పండుగ చందాలను సేకరిస్తారు. అలా సేకరించగా వచ్చిన డబ్బులను భూమి పండగ నిర్వహణకు ఖర్చు చేస్తారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మలేరియాపై అవగాహన

ప్రజాశక్తి -రోలుగుంట:మండలంలోని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం మలేరియా మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులకు కారణమైన దోమల నివారణపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సి వైద్యాధికారులు సునీత, శ్రీనివాసరావు మాట్లాడుతూ, అందరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బెన్నయ్య, పి హెచ్ఎన్. సత్యనారాయణమ్మ, ఎంపిహెచ్ఈఓ నూకరాజు, హెల్త్ సూపర్‌వైజర్ రమా కాంతరావు, హెచ్‌వి సన్యాసమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

నీట్‌పై సమగ్ర విచారణ జరపాలి

-ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు జి.గీతాకృష్ణ

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్:నీట్ పరీక్షపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జీ.గీతాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నీట్ యుజీ 2024 ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, వారందరికీ 720/720 మార్కులు రావడంతో ఎన్నో అనుమానాలు వస్తున్నాయన్నారు. అదే సెంటర్లో ఎగ్జామ్ రాసిన జాన్వీ అనే విద్యార్థిని 179 ప్రశ్నలను అట్టెంప్ట్ చేయగా అందులో 163 కరెక్ట్ అయ్యాయయన్నారు. ఆమెకు 636 మార్కులు రావాలి కానీ 720/720 ఎలా వచ్చాయంటూ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని చెప్పారు. సాధ్యం కాని విధంగా 718, 719 మార్కులు వచ్చాయని (04 -1) విధానాన్ని నీట్ ఎగ్జామ్లో ఫాలో అవుతారని, అలా చూసుకుంటే 718, 719 మార్కులు ఎలా సాధ్యమని ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని చెప్పారు.ఒక ప్రశ్నకు రెండు సరైన సమాధానాలు ఉన్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని చెప్పారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి

ప్రజాశక్తి-హుకుంపేట:ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని కాపాడాలని, తక్షణమే అక్రమ కట్టడాలను తొలగించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణారావు, మండల అధ్యక్షులు పి.సోమన్న, సాంబమూర్తిలు ఒక ప్రకటనలో కోరారు. హుకుంపేట మండల కేంద్రంలో ఇప్పటికే గిరిజనేతరులు వివిధ రూపాల్లో దొడ్డి దారిన అక్రమ కట్టడాలను చేపడుతున్నారన్నారు. సుమారు 15-20 ఎకరాల గిరిజన, ప్రభుత్వ భూములను గిరిజనేతరులు ఆక్రమించుకొని శాశ్వత, పక్కా నిర్మాణాలు చేసుకొంటున్నారని తెలిపారు. గిరిజనులకు, గిరిజనేతరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ భుమి బధలాయింపు చెల్లదని చట్టంలో స్పష్టంగా ఉందని పేర్కొన్నారు. అధికారుల ప్రమేయం లేకుండా మండలంలో 36 శాశ్వత పక్కా భవనాలు ఎలా కట్ట గలుగు తున్నారని ప్రశ్నించారు.గిరిజన నిరుద్యోగి ఏదైనా నిర్మాణం చేపడితే ఆగమేఘాలపై వాటిని కూల్చి వేయడానికి పూనుకోవడం ఎంతవరకు సమంజసం అన్నారు.

ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - పెదబయలు : ఇంట్లో బంగారం చోరీ జరిగినట్లు స్థానిక పోలీసు స్టేషన్ లో మంగళవారం ఓ ఉపాధ్యాయుడు పిర్యాదు చేశాడు. మండల కేంద్రంలో మొదకొండమ్మ జాతర మూడురోజుల పాటు జరుగుతుంది. ఈ నేపథ్యంలో తోటి ఉపాధ్యాయుడైన కోటి నిక్కుల గంగాధరంను సోమవారం రాత్రి భోజనానికి పిలవడంతో ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. అక్కడే నిద్రపోయారు. మంగళవారం ఇంటికి చేరుకోగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో బంగారం అపహరించారని బాధితుడు తెలిపారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

జెడ్‌పిటిసి రమణమ్మకు నివాళి

ప్రజాశక్తి- కొత్తకోట:రావికమతం మండలం జడ్పిటిసి సభ్యురాలు, విశాఖ ఉమ్మడి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ చైర్ పర్సన్ తలారి రమణమ్మ అంత్యక్రియలు మంగళవారం కొత్త కోటలో నిర్వహించారు. సోమ వారం సాయంత్రం విశాఖలో ఈమె మృతి చెందిన సంగతి తెలిసిందే.ఈ అంత్య క్రియల్లో విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పి చైర్మన్ జల్లిపల్లి సుభద్ర, చోడవరం టిడిపి ఇన్ ఛార్జ్ బత్తుల తాతయ్యబాబు, ఎంపిపి పైల రాజు, పలు మండలాలకు చెందిన జడ్పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్, ఎంపిటిసిలు పాల్గొని శ్రద్ధాంజలి ఘట్టించారు.

పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలురు పాఠశాలలో మూడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థుల ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రధాన ఉపాధ్యాయుడు అర్జున్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మూడవ తరగతిలో 40, నాల్గవ తరగతిలో 40, ఐదవ తరగతిలో 38, ఆరవ తరగతిలో 37 సీట్లు ఖాళీగా ఉండగా ఏడవ తరగతి 14, ఎనిమిదవ తరగతి 9, పదవ తరగతిలో 16 చొప్పున మొత్తం 203 సీట్లు ఖాళీగా ఉన్నాయనా తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా మోదకొండమ్మ అనుపోత్సవం



ఘటాలు ఊరేగిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు పట్టణంలో మోద కొండమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు కదిలి వచ్చారు. ప్రతి ఇంటి నుంచి ప్రతి ఒక్కరు తలపై ఘటాలను పెట్టుకొని డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. పాడేరులో మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. నేల వేషాలు, విభిన్న సాంస్కృతిక నృత్య ప్రదర్శనలతో మంగళవారం అనుపు ఉత్సవం అత్యంత వైభవంగా సాగింది. శతకం పట్టు నుంచి అమ్మవారి ఉత్సవ మూర్తిని అమ్మవారి పాదాలు ఘటాలను జిల్లా కలెక్టర్ విజయ సునీత, జెసి భావన వశిష్ట, పిఓ అభిషేక్, ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు, ఆలయ కమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే గిడ్డిశ్వరి తదితరులతోపాటు వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. గరగల నృత్యాలు అమ్మవార్ల వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మోదకొండమ్మ అమ్మవారిని దర్శించు కొన్నారు ఉదయం నుంచి ఆలయం వద్ద భక్తులు బారులు ఆలయంలో ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. తమ కుటుంబ సభ్యులతో బంధువులతో భక్తులు అమ్మవారికి పటాలను తీసుకువచ్చి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి పట్టణంలో డప్పు వాయిద్యాలు తోను గటాల ఊరేగింపుతోను సందడిగా మారింది. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సింహాచలం నాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొట్టగొల్లి రామారావు, శ్రీనివాస్, ప్రసాద్, నాయుడు వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పులిహోర మజ్జిగ పంపిణీ ...

పాడేరు పట్టణంలో మంగళవారం జరిగిన మోదకొండమ్మ జాతరకి విచ్చేసిన భక్తులకి వాసవి క్లబ్ పాడేరు హిల్స్ , వనిత మోదమాంబ క్లబ్ ఆధ్వర్యంలో చల్లటి మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు.పట్టణంలోని మూడు చోట్ల శతకం పట్టు వద్ద పంచాయితీ ఆఫీస్ వద్ద మెయిన్ రోడ్డు ప్రాంగణంలోనూ ఈ పులిహోర మజ్జిగ పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు శ్రీనాథ్, శ్రీను, అడిషనల్ ట్రెజరర్. క్లబ్ ప్రెసిడెంట్ సెక్రటరీ . మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగ ప్రదర్శన

మోదకొండమ్మ జాతర మహోత్సవం సందర్భంగా అమ్మవారి గుడి ఎదురుగా ఉన్నటువంటి ఓపెన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన శివలింగం,



గరగల నృత్య ప్రదర్శన చేపడుతున్న కళాకారులు

మోదకొండమ్మ సహస్ర మూర్తుల దివ్య దర్శనం, నిరంతర అభిషేక మహా శివలింగం దర్శనం, ప్రముఖ ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన నిర్వహించారు. ఆధ్యాత్మిక చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆడిటోరియం వద్ద సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన పీవో

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ మంగళవారం మోదకొండమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక ప్రజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్ ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి ఎం.హేమలత, ఐటిడిఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు

ప్రజాశక్తి-నక్కపల్లి:ఈనెల 12న కేసరపల్లి ఐటీ పార్క్ ప్రాంగణంలో జరిగే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవానికి తరలి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానుల వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కాగిత టోల్ ప్లాజా వద్ద మంగళవారం ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.తన సిబ్బందితో కలిసి టోల్ ప్లాజా వద్ద వాహనాలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు .



ట్రాఫిక్ నియంత్రణ చేపడుతున్న పోలీసులు



ప్రభుత్వ కార్యాలయాలు కళకళ

ప్రజాశక్తి-నక్కపల్లి:ఈనెల 12న బుధవారం కేసరపల్లి ఐటీ పార్క్ ప్రాంగణంలో జరిగే ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, మంత్రుల ప్రమాణ స్వీకరణ సందర్భంగా కొత్త ప్రభుత్వం కొలువు ధీరడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ కాంతులతో అలంకరించారు. మంగళవారం రాత్రి మండల పరిషత్ కార్యాలయం, వెలుగు కార్యాలయాలకు విద్యుత్ అలంకరణ చేపట్టారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాలు కొత్త శోభ సంతరించుకున్నాయి.